ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 3 మే 2025

బెదిరింపు కాల్స్ వచ్చాయ్

● స్పీకర్ యూటీ ఖాదర్



బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): పలుమార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని, వీటి వెనుక అండర్‌వరల్డ్ ఉండవచ్చని స్పీకర్ యూటీ ఖాదర్ అన్నారు. బీదర్‌లో గురువారం మీడియాతో మాట్లాడిన వేళ గతంలోనూ పలుమార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయన్నారు. ప్రతి వ్యక్తి ఎక్కడ పుట్టాలో, ఎక్కడ మృతి చెందాలో దేవుడు నిర్ణయిస్తాడన్నారు. ప్రశాంతంగా ఉండాలని మాత్రమే దేవుడిని ప్రార్థిస్తామని, అంతా దేవుడి నిర్ణయమని, మనచేతిలో ఏమీ ఉండదన్నారు. నా కోసం ప్రత్యేకంగా దక్షిణకన్నడ జిల్లాలో ఎస్‌ఐఎను స్థాపించడం సరికాదని, జిల్లా సంక్షేమం కోసం ఏర్పాటు చేయాలన్నారు. మంగళూరులో గుంపులుగా వచ్చి హత్యలు చేయడం సరికాదన్నారు. ఒకరు చేశారని మరొకరు ఇదే విధానంతో ముందుకెళ్తే పరిస్థితి ఏం కావాలన్నారు. విద్యార్థులు యువతకు ఎవరూ రెచ్చగొట్టేలాంటి చర్యలను ప్రోత్సహించరాదన్నారు. కశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడికి కఠినశిక్ష పడాలన్నారు. దాడి జరిగినప్పుడు భద్రతా సిబ్బంది లేకపోవడమే తీవ్ర పరిణామాలకు కారణమైందన్నారు.

మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ వివాదంలో హైకోర్టులో సీటీ రవికి షాక్

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): బెళగావి సువర్ణసౌధ విధానపరిషత్‌లో మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మేరకు నమోదైన కేసును రద్దు చేయాలని బీజేపీ ఎమ్మెల్సీ సీటీ రవి దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం న్యాయమూర్తి జస్టిస్ ఎం నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. అంతలోనే పిటిషన్ కొట్టివేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు. దీంతో సీటీ రవికి ఈ వివాదంలో చుక్కెదురైంది. గత ఏడాది శాసనసభ శీతాకాల సమావేశాల వేళ బెళగావిలో విధానపరిషత్‌లో చివరి రోజు వాగ్వాదం వేళ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్‌ను ఉద్దేశించి సీటీ రవి అనుచితమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. మంత్రి ఫిర్యాదు మేరకు హిరేబాగేవాడి పోలీసులు కేసు నమోదు చేశారు. నాలుగు గంటల వీడియో రికార్డులో ఏడు సార్లు అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అదేరోజున సీటీ రవిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. సదరు కేసును కొట్టివేయాలని సీటీ రవి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేయడంతో రవి కేసును ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

టీడీఎక్స్ హ్యాకథాన్‌లో 178 బృందాలు

7



కులగణన నివేదికకు.. ధోకా లేనట్టే..!

● వచ్చే బడ్జెట్‌లో కులాల ఆధారంగా గ్రాంట్లు ● కేంద్రంపై ఒత్తిడికి కాంగ్రెస్ వ్యూహం ● రిజర్వేషన్ల పెంపునకు రాష్ట్రం నుంచే డిమాండ్



బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన జనాభా లెక్కలతోపాటు కులగణన జరపనున్నట్టు కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరుణంలో రాష్ట్రానికి సంబంధించిన కులగణన నివేదికకు ఢోకాలేనట్టేనని తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన నివేదికపై అగ్రకులాల నుంచి తీవ్రమైన ఒత్తిడి ఉంది. జనాభా తక్కువ చూపారని, రాజకీయంగా దెబ్బతీసేందుకు కుట్ర సాగుతోందని కీలకమైన కులాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో అమలు చేసిన కులగణన నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించేందుకు అంగీకరించమని కేబినెట్‌లో కీలకమంత్రులే తేల్చి చెప్పారు. కులగణన నివేదిక ఆమోదానికి మరో ఏడాది పట్టవచ్చని, సమగ్ర చర్చలు జరగాలని అవసరమైతే శాసనసభ సమావేశాలు కూడా ఏర్పాటు చేయవచ్చునని మంత్రి సతీశ్‌జార్కిహోళి అభిప్రాయపడ్డారు. ఇలా కేబినెట్‌లోనే భిన్నాభిప్రాయాలు ఉండడంతో నెలరోజులక్రితం కులగణన నివేదికను స్వీకరించింది. ఆ తర్వాత అడుగులు ముందుకు పడలేదు.

సంచలనం రేపిన నివేదిక

ఇలా రాష్ట్రంలో సర్వే చేసిన కులగణన నివేదిక సొంత పార్టీ కాంగ్రెస్‌తోపాటు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం రేపింది. ప్రధానంగా ఒక్కలిగ, లింగాయత, బ్రాహ్మణ, కమ్మ సామాజికవర్గాలు కులగణన నివేదికను వ్యతిరేకిస్తున్నాయి. సీఎం సిద్దరామయ్య ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇలా సాగుతున్న తరుణంలోనే కేంద్రప్రభుత్వం కులగణన సర్వే చేయాలని తీర్మానించిన నేపథ్యంలో రాష్ట్రానికి సంబంధించిన సర్వే నివేదిక సేఫ్ అనిపిస్తోంది. అందుకు పలు కారణాలు ఉన్నాయి.

నివేదిక ప్రకారమే గ్రాంట్లు

రాష్ట్రంలో పదేళ్లక్రిందట జరిపిన కులగణన సర్వేను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు సిద్ధమైందని, ఇది రాష్ట్రానికి గర్వకారణమని నాయకులు అంటున్నారు. రాష్ట్రంలో అమలులో ఉన్న గ్యారెంటీలను కేంద్రం కాపీ చేసిందని పలుమార్లు విమర్శలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా రాష్ట్ర పర్యటనలో ఉన్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్మిక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న తర్వాత గురువారం మధ్యాహ్నం సుదీర్ఘ సమయంపాటు చర్చలు జరిపారు. అనంతరం సీఎం సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ కులగణన నివేదికపై ఈనెల 9న కేబినెట్‌లో చర్చించి మరిన్ని నిర్ణయాలు ప్రకటిస్తామన్నారు. వచ్చే బడ్జెట్‌లో కులగణన నివేదిక ప్రకారమే గ్రాంట్లు కేటాయిస్తామని 50శాతం గరిష్ఠ రిజర్వేషన్ మార్పు చేయదలిచినట్టు ప్రకటించారు. కులగణనతో హిందువులకు రిజర్వేషన్లు కల్పించాలనేది రాజ్యాంగం సూచిస్తుందని, జనాభా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించడం అనుకూలం కానుందని, వారిని ఇప్పటివరకు వివిధ విభాగాల ద్వారా నష్టపోయినవారికి న్యాయం కల్పించడం సాధ్యం కానుందన్నారు.

త్వరితగతిన సర్వే చేపట్టాలి: సీఎం

ఇప్పటివరకు కేంద్రం కులగణన సర్వేను వ్యతిరేకించిందని, ప్రస్తుతం సర్వే చేస్తామని ప్రకటించిందని, కేంద్రం కేవలం హామీలతో సరిపెట్టకుండా అమలు చేయాలని సీఎం డిమాండ్ చేశారు. ఎప్పటినుంచి దేశవ్యాప్తంగా కులగణన ప్రారంభిస్తారో, ఎప్పటిలోగా ముగిస్తారనేది బహిరంగం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటిదాకా వివిధ రాష్ట్రాలలో జరిపిన సర్వేలు అశాస్త్రీయమని కేంద్రమంత్రులు అశ్వినివైష్ణవ్, ధర్మేంద్రప్రధాన్‌లు వ్యాఖ్యానించారని పైగా కులగణన సర్వే చేసేందుకు రాష్ట్రాలకు హక్కు లేదని రాజ్యాంగంలో అటువంటి సిఫారసు ఉందా..? అని ప్రశ్నించారన్నారు. కానీ రాష్ట్రంలో అమలు చేసింది సామాజిక, ఆర్థిక, విద్యా సర్వే అని కేంద్రం కూడా అదే విధానంతో అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2015లో బీసీ కమిషన్ 192 కోట్ల రూపాయలతో 1.60 లక్షలమందితో సర్వే జరిపారు. కానీ కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కేవలం రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని సీఎం సిద్దరామయ్యతో పాటు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించారు. దేశవ్యాప్తంగా కర్ణాటక, బీహార్, తెలంగాణలలో సర్వేలు జరిగాయి.

బీజేపీపై ఒత్తిడికి వ్యూహం

కులగణన విషయంలో కేంద్రంపై ఒత్తిడికి కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరించదలిచింది. అందుకు రాష్ట్రంలో అమలు చేసిన కులగణన అంశాలను ప్రస్తావిస్తూ పలు అంశాలను తెరపైకి తీసుకురాదలిచింది. గణాంకాలకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని కేంద్రానికి సిఫారసు చేయదలిచారు. కేంద్రంలో అమలు చేసే కులగణన నివేదిక చట్టం ద్వారా రాష్ట్రంలో ముందుగానే అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. రాష్ట్రంలో కులగణన నివేదికను ఇప్పటికే కేబినెట్ స్వీకరించింది. ఆమోదం తెలిపి కేంద్రానికి సమర్పించదలిచారు. తద్వారా మా సిఫారసులను జారీ చేయాలని కేంద్రంపై ఒత్తిడి చేయడంతోపాటు నిరంతరంగా బీజేపీపై విమర్శలు చేసేందుకు అస్త్రాలుగా ఉపయోగించుకోదలిచారు. మరోవైపు కేంద్రం కులగణన చేస్తామని ప్రకటించడం ద్వారా దేశవ్యాప్తంగా ఆదరణ పొందే ప్రయత్నానికి కర్ణాటకలో ఆమోదించిన నివేదికను పెండింగ్‌లో పెట్టారని, కేంద్రంలోని బీజేపీ కంటే కర్ణాటకలోని కాంగ్రెస్ సామాన్యవర్గాల అభ్యున్నతికై పదేళ్లకిందటే కీలక నిర్ణయం తీసుకుందని దేశవ్యాప్తంగా ప్రచారం చేయదలిచారు.

రిజర్వేషన్ శాతాన్ని పెంచాలి

50శాతం రిజర్వేషన్‌ను సరళీకరించి శాతాన్ని పెంచాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయదలిచారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో రాజ్యాంగం ఆర్టికల్ 15 కాలం(5) మాదిరిగా రిజర్వేషన్ కల్పించాలి. కులగణన మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య సర్వే జరపాలి. కులగణన చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకోకుండా వెంటనే తేదీలను ప్రకటించి అందుకు తగ్గట్టు కార్యాచరణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి కేంద్రప్రభుత్వం ప్రకటించిన జనాభా లెక్కలు, కులగణన ప్రక్రియ ప్రారంభిస్తే కనీసం ఐదారు నెలలు పడుతుంది. వాటిని క్రోడీకరించుకుని నివేదికలు సిద్ధం చేయాలంటే మరో ఐదారు నెలలు కావాలి. ఇలా సంవత్సరమైనా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. కానీ రాష్ట్రంలో చేసిన కులగణన సర్వే నివేదిక అమలుకు కేంద్రం జాప్యం చేస్తోందనే విమర్శలు చేయదలిచారు. మొత్తానికి కేంద్రప్రభుత్వం కులగణన జరుపుతామని ప్రకటించడంతో రాష్ట్రంలో అమలు చేసిన కులగణన సర్వేకు కొత్త ఊపిరి వచ్చినట్టయ్యింది. కానీ కేబినెట్‌లోని మంత్రులందరూ స్పందిస్తారా..? అనేది వేచి చూడాల్సి ఉంది.

సోయగమే..

రోడ్డుకిరువైపులా మే ఫ్లవర్



విజయపుర పట్టణం నుంచి తాలూకా కేంద్రమైన దేవనహళ్ళికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా మే ఫ్లవర్ పూలు ప్రకృతి శోభతో ఆకట్టుకుంటున్నాయి. అలాగే జయచామరాజేంద్ర లే అవుట్ తదితర ప్రాంతాల్లో మే ఫ్లవర్ చూపరులను కట్టిపడేస్తున్నాయి.

-విజయపుర, ఆంధ్రజ్యోతి

తిరుపతి జిల్లాలో కారు బోల్తా

● తాతా మనవళ్ల దుర్మరణం.. మరో ముగ్గురికి గాయాలు

చంద్రగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కాశిపెంట్ల వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో శుక్రవారం ఉదయం కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తాతా మనవడు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు సమీపంలోని లగేరి గ్రామానికి చెందిన మంజునాథ్, భార్య సౌమ్య, కుమారుడు నూతన్(6), అత్తమామలు దొడ్డమ్మ, కరేగౌడ(64), శుక్రవారం తెల్లవారు జామున శ్రీవారి దర్శనానికి కారులో బయలుదేరారు. ఉదయం 9 గంటల సమయంలో కాశిపెంట్లకు రాగానే కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో కరేగౌడ్, నూతన్‌కు తీవ్రంగాను.. మంజునాథ్, సౌమ్య, దొడ్డమ్మకూ గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అప్పటికే కరేగౌడ్, నూతన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవింగ్ చేస్తున్న మంజునాథ్ తన ముందు వెళుతున్న కారును అధిగమించబోయి ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు అంటున్నారు.



బోల్తాపడిన కారు





గాయపడిన సౌమ్య, దొడ్డమ్మ

ఎస్ఎస్ఎల్‌సీలో.. 66.14 శాతం ఉత్తీర్ణత..!

● దక్షిణకన్నడ జిల్లా టాప్ ● చివరిస్థానంలో కలబురగి ● 22మందికి ఫస్ట్ ర్యాంకు



ఫలితాలు ప్రకటిస్తున్న మంత్రి మధు బంగారప్ప, బోర్డు కమిషనర్ రష్మి మహేశ్



విద్యాభారతి విద్యాలయ హైస్కూల్‌లో జాహ్నవికి అభినందనలు

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో 66.14శాతం ఉత్తీర్ణత సాధ్యమైంది. శుక్రవారం ఎస్ఎస్ఎల్‌సీ బోర్డులో ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప ఫలితాలు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 21నుంచి ఏప్రిల్ 4వరకు 2818 కేంద్రాలలో పరీక్షలు జరిగాయి. 7,90,890 మంది పరీక్షల్లో పాల్గొనగా 5,23,075మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 3,21,841మందికిగాను 2,01,790 (62.7శాతం), ఎయిడెడ్ పాఠశాలల్లో 2,00,214 మందికిగాను 118066 (58.97శాతం), ప్రైవేట్ పాఠశాలల్లో 2,68,835 మందికిగాను 203219 (75.59శాతం) ఉత్తీర్ణత సాధ్యమైంది. సగటున 66.14శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఫస్ట్‌లాంగ్వేజ్ ప్రకారం కన్నడలో 57.61శాతం, తెలుగులో 74.56, ఇంగ్లిషు 78.38శాతం, తమిళం 37.88, ఉర్దూ 46.46, హిందీ 53.72శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

●625 మార్కులకుగాను 625 మార్కులను 22మంది విద్యార్థులు సాధించారు. 624 మార్కులు 65మంది, 623 మార్కులు 108మంది, 622 మార్కులు 189 మంది, 621 మార్కులు 259 మంది, 620 మార్కులు 327మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం 329స్కూళ్లు, ఎయిడెడ్‌లో 53 పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో 539 స్కూళ్లు ఉత్తీర్ణత సాధించాయి. ఇక సున్నా ఫలితాల నమోదులో 6 ప్రభుత్వ పాఠశాలలు, 30 ఎయిడెడ్, 108 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.



టాపర్: రూపా పాటిల్

625/625 సాధించిన విద్యార్థులు వీరే..

విజయపురకు చెందిన అఖిల్ అహ్మద్ నదాఫ్, బెంగళూరు గ్రామీణ దేవనహళ్ళి విద్యార్థి భావన, బెంగళూరు ఉత్తర యశ్ పబ్లిక్ స్కూల్ ధనలక్ష్మి, మైసూరు మరిమల్లప్ప స్కూల్ విద్యార్థి ధనుశ్, మండ్య జిల్లా సాహుకార్ చిక్కనగౌడ స్కూల్ విద్యార్థి ధ్రుతి, బెంగళూరు దక్షిణ విజయభారతి విద్యాలయ జాహ్నవి, మల్లేశ్వరంలోని కిశోరకేంద్ర స్కూల్ మధుసూధన రాజు, తుమకూరులోని చేతన విద్యామందిర్ మహ్మద్ మస్తూర్ అదిల్, చిత్రదుర్గ జిల్లా రాష్ట్రీయ అకాడమీ మౌల్యరాజ్, శివమొగ్గ జిల్లా ప్రియదర్శిని హైస్కూల్ నమన, బెంగళూరు దక్షిణ మాతా నేషనల్ ఇంగ్లిష్ స్కూల్ నమిత, చిత్రదుర్గలోని రాష్ట్రీయ అకాడమీ స్కూల్ నందన, శివమొగ్గ జిల్లా రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నిత్య ఎం కులకర్ణి, బెంగళూరు గ్రామీణ జిల్లా చంద్రశేఖరనాథ్ స్వామీజీ హైస్కూల్ రంజిత, బెళగావి జిల్లా దేవలపుర గవర్నమెంట్ కంపోజిట్ పీయూ కాలేజ్ రూప చనగౌడ పాటిల్, శివమొగ్గ జిల్లా శరావతి నగర్ ఆదిచుంచనగిరి హైస్కూల్ సహిష్ను, ఉత్తరకన్నడ జిల్లా శిరసి గవర్నమెంట్ ఉర్దూస్కూల్ షాగుప్త అంజుమ్, ఉడుపి జిల్లా కార్కళ జ్ఞానసుధ స్వస్తి కామత్, మైసూరులోని టీకేఎస్‌వీటీ హైస్కూల్ తాన్యా, హాసన్‌లోని విజయస్కూల్ ఉత్సవ్‌పటేల్, తుమకూరు జిల్లా మధుగిరిలోని చిరెక్ పబ్లిక్‌స్కూల్ యశ్వంతరెడ్డి, బెంగళూరు దక్షిణ బనశంకరిలోని హోలి చైల్డ్‌స్కూల్ యుక్త ఎస్‌లు వందశాతం మార్కులు సాధించారు.

గ్రేస్ మార్కులు లేకుండా...

కొవిడ్ కాలంలో పరీక్షలు సజావుగా నిర్వహించలేని పరిస్థితుల్లో ప్రతి విద్యార్థికి గ్రేస్ మార్కులు కల్పించారు. ఆ విధానం 2023-24 విద్యాసంవత్సరం దాకా కొనసాగింది. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలోనే గ్రేస్ మార్కులు ఉండవని ప్రభుత్వం తేల్చి చెప్పింది. గత ఏడాదితో పోలిస్తే 8శాతం ప్రగతి సాధ్యమైంది. 2024లో 625 మార్కులు సాధించినవారు ఇద్దరు కాగా ఈ ఏడాది 22మంది ఉండడం విశేషం.

ఉచితంగా సప్లిమెంటరీ

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో ఫెయిల్ అయినవారి కోసం సప్లిమెంటరీ 2 అండ్ 3 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈనెల 26నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జూన్ 2వ తేదీతో ముగుస్తాయి. ఆ తర్వాత మరో సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 23నుంచి 30వరకు కొనసాగనున్నాయి. సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొనేవారు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన పనిలేదన్నారు. అయితే గత ఏడాది విద్యార్థులకు వర్తించదు. ఫలితాలు ప్రకటించేవేళ మీడియా సమావేశంలో ఎస్ఎస్ఎల్‌సీ బోర్డు కమిషనర్ రష్మి మహేశ్, విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జిల్లా పేరు	శాతం	జిల్లా పేరు	శాతం
దక్షిణకన్నడ	91.12	ధారవాడ	67.62
ఉడుపి	89.96	విజయనగర	67.62
ఉత్తరకన్నడ	83.19	తుమకూరు	67.03
శివమొగ్గ	82.29	దావణగెరె	66.09
కొడగు	82.21	చిక్కబళ్ళాపుర	63.64
హాసన్	82.12	చిత్రదుర్గ	63.21
శిరసి	80.47	రామనగర	63.12
చిక్కమగళూరు	77.9	బెళగావి	62.16
బెంగళూరు గ్రామీణ	74.02	చిక్కోడి	62.12
బెంగళూరు దక్షిణ	72.3	చామరాజనగర	61.45
బెంగళూరు ఉత్తర	72.27	మధుగిరి	60.65
మండ్య	69.27	బళ్ళారి	60.26
హావేరి	69.03	కొప్పళ	57.32
కోలారు	68.47	బీదర్	53.25
మైసూరు	68.39	రాయచూరు	52.05
బాగల్కోటె	68.29	యాదగిరి	51.60
గదగ్	67.72	విజయనగర	49.58
		కలబురగి	42.43



ధనలక్ష్మి



జాహ్నవి



మహ్మద్ మస్తూర్ ఆదిల్



తుమకూరు విద్యామందిర విద్యార్థిని



తాన్యా



సదాఫ్



నందన్



అద్భుతంగా అమరావతి




పవన్ స్వాగతం.. లోకేశ్ మోదీ చమత్కారం




కాజ టోల్ గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు



సభా ప్రాంగణంలోనే వైద్య సేవలు



సభా వేదిక వద్దకు తరలివస్తున్న విద్యార్థినులు



సభా వేదిక వద్ద ఏర్పాటు చేసిన భోజనాలు



గ్యాలరీల బయట జనం

అద్వితీయంగా శంకుస్థాపన వేడుక ● రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల సందడి

వినాశనం నుంచి వికాసం దిశగా.. అమరావతి పరుగులు పెట్టేందుకు సిద్ధమైంది. శిథిలం నుంచి ప్రపంచం అచ్చెరువొందేలా ఆంధ్రుల కలల రాజధాని పునర్నిర్మాణం దిశగా పయనించనున్నది. ఈ అపురూప కార్యక్రమానికి శుక్రవారం రాజధాని పరిధిలోని వెలగపూడి వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శ్రీకారం చుట్టారు. అమరావతి అభివృద్ధి మనమే చేయాలి.. మనమే చేస్తాం.. అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సాక్షిగా పిలుపిచ్చారు. దేవతల రాజధాని అమరావతి దేశాభివృద్ధికి కేంద్రంగా మారుతోం దని.. ఆ స్థాయిలో అభివృద్ధి చేస్తామని మోదీ ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. ఇక అమరావతి కేంద్రంగా వివిధ ప్రాజెక్టులతో పాటు రాష్ట్రంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ వివిధ ప్రాజెక్టులను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవానికి అతిరథ మహారథులతో పాటు ప్రధాన మంత్రి మోదీ రాకతో రాజధాని గ్రామాల్లో తిరునాళ్ల వాతావరణం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన జనాలతో రాజధానిలో పండుగ వాతావరణం కనిపించింది. - తుళ్లూరు, ఆంధ్రజ్యోతి




మహిళల విజయ దరహాసం




దుర్గ గుడి నుంచి సభా వేదిక వద్దకు సైకిల్‌పై వస్తున్న విజయనగరం ఎంపీ అప్పల నాయుడు



నవశకానికి నాంది..!

(5వ పేజీ తరువాయి)

నాలుగు వరుసల రహదారి విస్తరణకు ప్రధాని శంకుస్థాపన చేశారు. దీంతో జిల్లాలో ప్రధాన, జాతీయ రహదారుల అనుసంధానం జరిగి రవాణా సౌకర్యాలు మెరుగపడనున్నాయి. కదిరి, హిందూపురం, గోరంట్ల, పాలసముద్రం, పెనుకొండ, మడకశిర ప్రాంతాలకు రవాణా కనెక్టివిటీ పెరిగి పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయి. తద్వారా జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి.

పరిశ్రమల కోసం ఆర్‌ఓబీలు

ఎర్రమంచి కియ కార్ల పరిశ్రమతోపాటు గుడిపల్లి పారిశ్రామిక పార్కు వద్ద, కియ కార్ల అనుబంధ సంస్థలకు అనుసంధానంగా జాతీయ రహదారి 44 వద్ద ఆర్‌ఓబీల నిర్మాణాలను రూ. 124 కోట్లతో చేపట్టనున్నారు. ఈరెండు చోట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రధానమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. కియ కార్ల పరిశ్రమ ప్రధాన ప్లాంటు నుంచి అనుబంధ సంస్థలకు అనుసంధానంగా, జాతీయ రహదారికి అనుసంధానంగా ఆర్‌ఓబీల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం మెరుగవడంతో పాటు ప్రమాదాలకు చెక్ పడుతుంది. గుడిపల్లి పారిశ్రామిక వాడలో ఆటో మొబైల్ పరిశ్రమ, కియ అనుబంధ సంస్థలు, పాలసముద్రం వద్ద బెల్, నాసిన్ పరిశ్రమలకు అనుసంధానంగా రవాణా సౌకర్యం కలగనుంది. అదే విధంగా ట్రాఫిక్ సమస్యకు చెక్ పడనుంది.

అభివృద్ధికి అనుసంధానం

జిల్లాలో బెంగళూరు- హైదరాబాద్ నగరాలను కలుపుతూ పెనుకొండ, కొడికొండ చెక్‌పోస్టు మీదుగా విస్తరించిన నాలుగు వరుసల (44వ) జాతీయ రహదారిని 12 వరుసలతో విస్తరణకు కేంద్రం గత ఏడాదే ప్రాథమికంగా ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇది కార్యరూపం దాల్చితే జిల్లా అభివృద్ధిలో నవశకం మొదలవుతుంది. కడపజిల్లా మీదుగా బెంగళూరు - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే జిల్లాలో తలుపుల మండలం లక్కసముద్రం, ఓడులపల్లె గ్రామాల పరిధిలో ప్రారంభమై చిలమత్తూరు మండలం కోడూరు వద్ద 44 జాతీయ రహదారితో కలవనుంది. నాలుగు, ఆరు వరుసలతో నిర్మించే ఈ రోడ్డు పొడవు జిల్లాలో 75 కిలోమీటర్లు ఉండనుంది. గత టీడీపీ ప్రభుత్వం హయంలోనే కొడికొండ- శిర మధ్య 56.80 కి.మీ మేర రూ. 556 కోట్లతో జాతీయ రహదారి 544ఈ నిర్మాణం చేపట్టారు. ముదిగుబ్బ పుట్టపర్తి మీదుగా కోడూరు దాకా జాతీయ దహదారి 342 నిర్మాణం తుది దశకు వచ్చింది. కదిరి- గోరంట్ల దాకా జాతీయ రహదారి నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. జిల్లా సరిహద్దుకు 80 కిలోమీటర్లు దూరంలో దేవనహళ్లి అంతర్జాతీ విమానాశ్రయం ఉండటం, రోడ్ల అభివృద్ధి, అనుసంధానంతో జిల్లా అభివృద్ధికి మార్గం ఏర్పడనుంది.



గోరంట్ల- హిందూపురం రహదారి

రైల్వే ప్రాజెక్టులు ప్రారంభం

గుంతకల్లుకు సంబంధించిన రెండు రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని మోదీ పచ్చజెండా ఊపారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు సమీపంలోని వెస్ట్ గుంతకల్లు రైల్వే స్టేషన్ నుంచి మల్లప్పగేట్ వరకూ (గోవా-విజయవాడ లైన్ల అనుసంధానానికి) రూ. 293 కోట్లతో నిర్మించనున్న రైల్ ఓవర్ రైల్ బైపాస్ లైన్ నిర్మాణానికి శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేశారు. అలాగే గుంతకల్లు-గుంటూరు డబ్లింగ్ కార్యక్రమంలో భాగంగా బుగ్గనపల్లి-టీ సిమెంట్ నగర్-పాణ్యం స్టేషన్ల మధ్య విద్యుద్దీకరించిన డబుల్ లైన్ నిర్మాణపు పనులు పూర్తికావడంతో ఆ రైల్వే సెక్షన్‌ను జాతికి అంకితం చేశారు. ప్రధాని శంకుస్థాపన చేసిన వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ ప్రాజెక్టు , బుగ్గనపల్లి-పాణ్యం సెక్షన్ ప్రారంభోత్సవం వల్ల విజయవాడ లైన్‌లో గూడ్సు, ఎక్స్‌ప్రెస్ రైళ్ల కనెక్టివిటీ పెరిగి ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. విజయవాడకు కొత్త రైళ్ల డిమాండ్ ఎక్కువగా ఉన్నా ట్రాక్ సౌలభ్యం లేకపోవడంతో కొత్త రైళ్లను ప్రవేశపెట్టలేదు. డబ్లింగ్ పూర్తయితే రాష్ట్ర రాజధానికి, కొత్త జోనల్ కేంద్రానికి వెళ్లడానికి కొత్త రైళ్లు వచ్చే అవకాశాలు ఏర్పడతాయి. అలాగే వెస్ట్‌గుంతకల్లు-మల్లప్పగేట్ బైపాస్ లైన్ నిర్మాణం జరిగితే కర్ణాటకలోని జిందాల్, తదితర పరిశ్రమల నుంచి సరుకు రవాణా వేగవంతం అవుతుంది. పైగా ప్రస్తుతం గోవా వైపు నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే సరుకు రవాణా రైళ్లు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోకి రావాల్సిన పరిస్థితి ఉంది. బైపాస్ పూర్తయితే గూడ్సు రైళ్లు గుంతకల్లు స్టేషన్ గుండా కాకుండా నేరుగా వెళ్తాయి. దీంతో ఎక్స్‌ప్రెస్ రైళ్లను సమయానుకూలంగా నడిపే అవకాశం ఏర్పడుతుంది.



వెలగపూడిలో ప్రధానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం.. చిత్రంలో సీఎం



సభలో మంత్రి సవిత..



వేదిక వద్ద ప్రధాని మోదీకి మంత్రి సత్యకుమార్ స్వాగతం

హోరు గాలి.. జోరు వాన..!



అనంతపురం నగరంలో వర్షం

అనంతపురం అర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. అనంతపురం, శింగనమల, గార్లదిన్నె, నార్పల, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. పుట్లూరు, పామిడి ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులతో అనంతపురం నగరంలో 8.30 గంటల నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.



పగటిని తలపించేలా నింగి.. నేల.. అనంతపురం నగరంలో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో..

అమరావతి సాకారానికి శ్రీకారం

● చంద్రబాబు పాలనాదక్షతకు దర్పణం

● పనుల పునఃప్రారంభోత్సవంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతనిధులు

అనంతపురం, మే 2(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రుల కలల రాజధాని అమరావతి సాకారానికి శ్రీకారం చుట్టడం మాకు ఆనందాన్నిస్తోంది. ప్రధానమంత్రి మోదీ చేతుల మీదుగా రాజధాని పనుల పునఃప్రారంభమైనందుకు ఎంతో గర్వపడుతున్నాం. మే 2వ తేదీ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే రోజు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనాదక్షతకు ఇదో దర్పణమ'ని జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కొనియాడారు. అమరావతిలో శుక్రవారం నిర్వహించిన రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఎన్డీఏ ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యారు. మంత్రులు పయ్యావుల కేశవ్, సవిత, సత్యకుమార్‌యాదవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుతోపాటు ఎంపీలు బీకే పార్థసారధి, అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్ రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా హాజరైన ఈ సభలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. అమరావతిని విధ్వంసం చేసిన చరిత్ర జగన్‌కే దక్కుతుందని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని ఏదని చెప్పుకోలేని పరిస్థితిలో వైసీపీ పాలన సాగడం రాష్ట్ర ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. వైసీపీ విధ్వంసకర పాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి నిర్మాణానికి బాటలు వేశారన్నారు. ఇది ప్రతి ఆంధ్రుడికి గర్వకారణమన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఆగిపోయిన రాజధాని పనులను ప్రధాని మోదీ పునఃప్రారంభించడం శుభపరిణామమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బలమైన సంకల్పంతోనే అమరావతి దేశంలోని మహానగరాల చెంతన చేరబోతుందనడంలో సందేహం లేదని వారు స్పష్టం చేశారు. ఏపీ భవిష్యత్తును మారుస్తూ ప్రపంచ స్థాయి రాజధాని నగరానికి బీజం పడడం శుభతరుణంగా వారు పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంబ్...

వీకే కృష్ణ మీనన్ (జయంతి)



వెంగలీల్ కృష్ణ కురుప్ కృష్ణ మీనన్ 1896 మే 3న కేరళ రాష్ట్రం థలస్సేరి ప్రాంతంలో జన్మించారు. జాతీయవాది, దౌత్యవేత్త, రాజకీయ నాయకుడు. దేశ తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు అత్యంత ఆప్తుడిగా పేరొందారు. కేంద్ర రక్షణశాఖ మంత్రిగాను, ఇతర హోదాలలోనూ కొనసాగారు. కెరీర్ ప్రారంభంలో పెంగ్విన్‌బుక్స్ సంస్థకు సంపాదకుడిగా పనిచేశారు. ఇతర దేశాల్లో భారత స్వాతంత్రోద్యమానికి ప్రాచుర్యం కల్పించారు. లండన్‌లో ఇండియా లీగ్‌ను స్థాపించడం ద్వారా సోవియట్ యూనియన్‌లాంటి శక్తివంతమైన దేశంనుంచి మద్దతు రాబట్టగలిగారు. పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1974 అక్టోబరు 6న కన్నుమూశారు. 1997లో జ్ఞాపకార్థం తపాలా బిళ్ల విడుదల చేశారు.

బింగ్ క్రాస్బీ (జయంతి)



హ్యారీ లిల్లిస్ బింగ్ క్రాస్బీ 1903 మే 3న యునైటెడ్ స్టేట్స్ దేశం టకోమా ప్రాంతంలో జన్మించారు. అమెరికన్ గాయకుడు, కమెడియన్, నటుడు. ఇరవయ్యో శతాబ్దంలో అత్యధికంగా అమ్ముడైన, అత్యంత విజయవంతమైన సంగీతకారుడు, తొలి మల్టీమీడియా కళాకారులలో ఒకరు. ఒక బిలియన్ రికార్డులు ఇంతవరకు అమ్ముడయ్యాయి. 41 నెంబరువన్ హిట్‌లు సహా 396 వ్యక్తిగత రికార్డులు కలిగి ఉన్నారు. 'వైట్ క్రిస్మస్' ఎంతో గుర్తింపు తెచ్చింది. రేడియోలలోనూ ప్రసారమైంది. గ్రామీ గ్లోబల్ అచీవ్‌మెంట్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 1977 అక్టోబరు 14న కన్నుమూశారు.

నర్గిస్ (వర్ధంతి)



ప్రముఖ నటి నర్గిస్‌దత్ 1929 జూన్ 1న కోల్కత్తాలో జన్మించారు. ఆమె అసలు పేరు ఫాతిమా రషీద్. 40, 60 దశకాల మధ్య వెండితెరపై రాణించారు. విమర్శకుల ప్రశంసలు సైతం అందుకున్నారు. 'మదర్ ఇండియా' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. అకాడమీ అవార్డుకు నామినేట్ అయ్యింది. బర్సాత్, అందాజ్, ఆవారా, చోరీచోరీ, రాత్ ఔర్ దిన్ తదతర సినిమాలు ఎంతో పేరొందాయి. ఫిలింఫేర్ ఉత్తమనటి అవార్డు, జాతీయ ఉత్తమనటి, పద్మశ్రీ తదితర అవార్డులు పొందారు. సునీల్‌దత్‌తో వివాహం అనంతరం సినిమాలు తగ్గించారు. 1981 మే 3న కన్నుమూశారు. ఆమె గౌరవార్థం వార్షిక సినిమా అవార్డు వేళ నర్గిస్‌దత్ అవార్డు ఇస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని కదిరికి చెందిన బాబ్‌జాన్ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాబ్‌జాన్ తనకల్లు మండలంలోని కొక్కంటి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. గత కొంతకాలంగా భార్య కాపురానికి రాకుండా పుట్టింటిలోనే ఉండిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన బాబ్‌జాన్ శుక్రవారం మద్యంతో పాటు పురుగుల మందు తాగాడు. పోలీస్ ఎదుట అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని పోలీసులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి రావడానికి అతని భార్య నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు.

పోక్సో కేసు.. రిమాండ్‌కు నిందితుడు

నల్లమాడ, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు మాయమాటలు చెప్పి వివాహం చేసుకుందామని తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బాలిక, యువకుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వారిని పోలీస్‌స్టేషన్ తీసుకొచ్చారు. యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, కదిరి కోర్టులో హాజరుపరిచి.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బత్తినవారిపల్లికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నగేష్, మౌనిక, రెడ్డిప్రసన్న బత్తినవారిపల్లి బైక్‌లో వెళ్తుండగా.. కొక్కంటి క్రాస్ సమీపంలోని ఐచర్ వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో మౌనిక, రెడ్డిప్రసన్న తీవ్రంగా గాయపడగా.. నగేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు ..

పుట్టపర్తి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పడంతో కిందపడి చెర్లోపల్లికి చెందిన ఆర్మీ కానిస్టేబుల్ లక్ష్మీపతి, ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిద్దరూ శుక్రవారం రాత్రి పుట్టపర్తి నుంచి చెర్లోపల్లికి బుల్లెట్ వెళ్తుండగా.. మండలంలోని వీరాంజినేయపల్లి వద్ద బైక్ అదుపుతప్పి.. ఈ ఇద్దరూ కిందపడ్డారు. తీవ్రంగా గాయపడ్డ వీరిని సత్యసాయి జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. లక్ష్మీపతి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగుళూరు ఆర్మీ ఆస్పత్రికి తరలించారు.

● ధర్మవరం: పట్టణ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా అనంతపురం పట్టణం మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతను పని నిమిత్తం ధర్మవరానికి వచ్చి తిరిగి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడ్డ అతన్ని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిమిత్తం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

మహిళపై దాడి .. నలుగురిపై కేసు

ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జోగోనికుంటలో ఆశాది వెంకట నాగిణిపై నలుగురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. నాగిణి మామిడికాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. మామిడికాయలు కొనుగోలు విషయంలో నాగిణిపై లక్ష్మీనారాయణ, కవిత, కాటమయ్య, గంగమ్మ దాడి చేసి గాయపరిచారు. దీంతో నాగిణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు.

కుల వర్గీకరణ సర్వేపై అవగాహన పెరగాలి



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్

ముళబాగిలు, మే 2(ఆంధ్రజ్యోతి): కులవర్గీకరణ సర్వేపై ప్రజల్లో అవగాహన పెరగాలని ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కాంతరాజ్ సర్కిల్‌లో ఏర్పాటైన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ జస్టిస్ నాగమోహన్‌దాస్ నేతృత్వంలో కులవర్గీకరణకు సంబంధించి ఈనెల 5 నుంచి 17వరకు సర్వే జరగనుందన్నారు. సర్వే వేళ బలగై, ఆది కర్ణాటక, ఛలవాది, పరియ, మాలా, మొహర్, ఆది ఆంధ్ర సముదాయానికి చెందినవారు తప్పనిసరిగా హొలెయ అని రాయించాలన్నారు. ప్రత్యేకించి ఎస్సీ వర్గీకరణకోసం సర్వే జరుగుతున్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ హొలెయ చెప్పడానికి వెనుకంజ వేయరాదన్నారు. దశాబ్దాలక్రితం కులగణన జరిగినవేళ అప్పట్లో నిరక్షరాస్యులు అధికంగా ఉండేవారన్నారు. అనేక జిల్లాల్లో మన కులం పేరును ఇతరులు వాడుకుంటున్నారన్నారు. తద్వారా హొలెయ సామాజికవర్గానికి చెందిన అసలైనవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో హొలెయ సామాజికవర్గంవారు అధికంగా ఉన్నప్పటికీ సదాశివ కమిషన్ నివేదికలో లోపాలు ఉన్నాయన్నారు. తక్కువసంఖ్య నమోదైందని ఈ అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నివేదికలోని లోపాలను సరిచేయాలని సూచించిన మేరకు రాష్ట్రప్రభుత్వం సిద్ధం కావడం స్వాగతార్హమన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలు ఎక్కువగా పొందాలంటే వివిధ రంగాలలో రిజర్వేషన్ ప్రయోజనాలకోసం కులగణనలో స్పష్టమైన సమాచారం ఇవ్వాలన్నారు. మునివెంకటప్ప, వెంకటరవణప్ప, వక్కలేరి రాజప్ప, నారాయణస్వామి, సోమేశ్, సతీశ్, రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీఎక్స్ హ్యాకథాన్‌లో 178 బృందాలు



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

బెంగళూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): సేల్స్‌ఫోర్స్ ఆధ్వర్యంలో టీడీఎక్స్ రెండో విడత హ్యాకథాన్‌లో 178 బృందాల ద్వారా 720మందికిపైగా ట్రయల్ బ్లేజర్ కోసం పోటీ పడ్డాయరు. సేల్స్‌ఫోర్స్ డెవలెపర్స్ ఎగ్జిబిటర్స్, ఆర్కిటెక్చర్స్, ఐటీతోపాటు వివిధ విభాగాలకు చెందిన వారికోసం హ్యాకథాన్ నిర్వహించింది. ఏప్రిల్ 29 నుంచి రెండు రోజులపాటు పోటీలు సాగాయి. సేల్స్‌ఫోర్స్ నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా 18వేలమందికిపైగా వ్యక్తిగతంగా అన్వేషణలు, ఆన్‌లైన్ ప్రయోగాలు, నైపుణ్యత, అడ్వాన్స్ టెక్నాలజీ విభాగాలలో అన్వేషించారు. సేల్స్‌ఫోర్స్ 3.9 మిలియన్లమందికిపైగా సభ్యులను కలిగి ఉంది. ఏఐ, డేటా టెక్నాలజీ సద్వినియోగంపై ప్రదర్శనలు సాగాయి. 50లక్షల విలువైన బహుమతులను అందించినట్లు దక్షిణ ఆసియా సేల్స్‌ఫోర్స్ ఛైర్మన్ అరుంధతి భట్టాచార్య తెలిపారు. యూనిఫైడ్ ఏజెంట్ ఫోర్స్ ప్లాట్‌ఫాం ఛైర్మన్ సీటీఓ మురళీధర్ కృష్ణప్రసాద్, సేల్స్‌ఫోర్స్ ఇండియా టెక్నాలజీ ఎండీ సంకేత్ అటల్‌లు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గుల్‌మొహర్ పుష్పాలు



గుల్ మొహర్ పుష్పాలు

శిడ్లఘట్ట, మే 2(ఆంధ్రజ్యోతి): మే నెల ప్రారంభంలో వికసించే 'మే ఫ్లవర్'గా పేరొందిన గుల్‌మొహర్ పుష్పాలు నయనమనోహరం అనిపించేలా శిడ్లఘట్ట పట్టణంతోపాటు తాలూకా వ్యాప్తంగా ఆకట్టుకుంటున్నాయి. పాఠ శాల ఆవరణలోనూ, ఉద్యానవనాల్లో, బహిరంగ స్థలాల్లో ఎరుపు - కాషాయ రంగు పుష్పాలు గుబాళిస్తున్నాయి. ప్రత్యేకించి పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉండే గుల్‌మొహర్ చెట్లు పుష్పాలతో అలరిస్తున్నాయి. పలువురు ఫోటోలు, సెల్ఫీలు తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

జ్ఞానభారతిలో వందశాతం ఉత్తీర్ణత



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎల్‌సీ ఫలితాల్లో యలహంకలోని జ్ఞానభారతి పబ్లిక్ స్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెడ్ మాస్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. డిస్టింక్షన్‌లో 15మంది, ఫస్ట్‌క్లాస్‌లో 21, సెకండ్ క్లాస్‌లో 11మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. 98శాతం మార్కులతో డి సంతోషిని పాఠశాల టాపర్‌గా నిలిచారని, 96శాతం మార్కులతో మల్లీశ్వరి, 92శాతంతో జగదీప్‌రెడ్డి, నేహాలు నిలిచారన్నారు. ఆ తర్వాత స్థానంలో 91 శాతంతో దీపిక, ఇందు తదితరులు ఉత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు. జ్ఞానభారతిలో ఏటా ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతున్నాయని అందుకు ఉపాధ్యాయుల శ్రమ, విద్యార్థుల కృషి కారణమన్నారు.

సామాజిక సేవకు దక్కిన గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న జాము రవి

దొమ్మసంద్ర, మే 2(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవలో రాణించిన ఎంసీ హళ్ళి గ్రామ పంచాయతీ మాజీ అధ్యక్షుడి జాము రవికి గౌరవ డాక్టరేట్ లభించింది. గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసి ప్రజాదరణ పొందారు. హోసూరులోని ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో సామాజిక, రాజకీయ సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేశారు. గ్రామపంచాయతీ అధ్యక్షులుగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సదుపాయం, వీధిదీపాలు తదితర సదుపాయాలు కల్పించారు. పేద విద్యార్థులకు సహాయ ధనం, ఆలయాల అభివృద్ధికి చేయూతనిచ్చేవారు. డాక్టరేట్ లభించడంపై పలువురు ఆయనను అభినందించారు.

నీటి వాడకంపై అవగాహన



సమావేశంలో ప్రముఖులు

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వేసవిలో పలుచోట్ల నీటి ఎద్దడి ఉన్న నేపథ్యంలో ప్రజలను చైతన్యం కల్పించేలా భారత్‌సోకా గక్కై సంస్థ ఆధ్వర్యంలో నీటి వాడకంపై అవగాహనా శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లోని జేఎన్ టాటా సభాభవనంలో సమావేశం జరిగింది. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని తమ తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి నివారణతోపాటు నగరంలో సుస్థిర సస్కృతి నిర్మాణం, తదితర అంశాలపై చర్చించారు. సంస్థ అధ్యక్షుడు విశేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కదంబ పార్కు అభివృద్ధికి శ్రీకారం



భూమిపూజ చేస్తున్న మంత్రి రామలింగారెడ్డి తదితరులు

బొమ్మనహళ్ళి, మే 2(ఆంధ్రజ్యోతి): ఆడుగూడిలోని సీఏఆర్ క్వార్టర్స్‌కు అనుబంధమైన కదంబ పార్కు అభివృద్ధి పనులకు రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి శ్రీకారం చుట్టారు. ఆరు ఎకరాలలో విస్తరించిన కదంబ పార్కును మరింత అభివృద్ధి చేయనున్నారు. పిల్లలు, వృద్ధులకు అను కూలంగా వాకింగ్ వీలు కల్పించారు. 80 లక్షల రూపాయలతో పార్కును సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి తెలిపారు. రాజులకాలం నాటి పేరును పార్కుకు పేరు పెట్టినట్టు తెలిపారు. ఇక్కడ మోడల్ స్కూల్ ఉందన్నారు. సీఏఆర్ క్వార్టర్స్‌ను మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్టు మంత్రి వివరించారు. మాజీ కార్పొరేటర్‌లు ఆడుగూడి మోహన్, మంజునాథ్, డీసీపీ చిన్నవీరప్ప అడపార్, స్థానిక ప్రముఖులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల ఫొటోలుంటేనే పరిహారం!

● అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ వింత ధోరణి

● ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత రైతు

మడకశిర రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన కర్బూజ పంటను ఎలుగుబంట్లు ధ్వంసం చేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతకు అటవీ అధికారి నుంచి వింత సమాధానం ఎదురైంది. ఎలుగుబంట్లు తోటలోకి వచ్చి, పంటను ధ్వంసం చేసిన ఫొటోలు, ఆధారాలు ఉంటేనే పరిహారం పంపిణీకి ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని చెప్పడంతో షాక్ అవడం అన్నదాత వంతైంది. నాగభూషణరెడ్డి సాగుచేసిన కర్బూజ పంటను ఎలుగుబంట్లు గతనెల 30న ధ్వంసం చేశాయి. దీంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. విషయాన్ని అటవీ అధికారులకు వెంటనే తెలిపాడు. పంట పరిశీలనకు అటవీ అధికారులు గురువారమే రావాల్సి ఉంది. కానీ రాలేదు. దెబ్బతిన్న కాయలను అలానే ఉంచుకుంటే పంట కోత కోసం వచ్చే వ్యాపారులు వెనుదిరుగుతారన్న ఉద్దేశంతో రైతు వాటిని తొలగించాడు.

అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ కుల్లాయప్ప తాపీగా శుక్రవారం పంట పరిశీలనకు వెళ్లాడు. నష్టపోయిన రైతుకు అండగా నిలవాల్సిందిపోయి, వింత ప్రశ్నలు వేశాడు. 'ఎలుగుబంట్లు తోటలోకి ప్రవేశించినట్లు ఫొటోలు ఉన్నాయా?' అని అడిగారు. రాత్రిపూట ఎలుగుబంట్లు తోటలోకి వస్తాయనీ, ఆ సమయంలో ఫొటోలు ఎలా తీస్తారని బాధిత రైతు వాపోతున్నాడు. ఎలుగుబంట్లను చూసి ఉండుంటే వాటిని తరిమేవారమనీ, పంటను తినేస్తుంటే చూస్తూ ఊరుకునేవారం కాదని అన్నదాత ఆవేదన చెందాడు. అంతేకాదు, ఎలుగుబంట్లు ధ్వంసం చేసిన కాయలను తొలగించడంతో పరిహారానికి సిఫార్సు చేయడం కుదరని సెక్షన్ ఆఫీసర్ చెప్పుకొచ్చారు. రైతుకు నష్టం వాటిల్లిదంటే వెంటనే రావాల్సిన కనీస బాధ్యతను మరచిన సెక్షన్ ఆఫీసర్ గురువారం రావాల్సింది పోయి.. ఒకరోజు ఆలస్యంగా వచ్చి.. కాయలు అలాగే ఉంచమంటే ఎలాగని రైతు అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి అధికారులు ఉంటే.. కరువు రైతులకు ఏం న్యాయం చేకూరుతుందని స్థానికులు వాపోయారు.

వలంటీర్ల ఫోన్లు భద్రమేనా?

ఎన్నికల ముందు స్వాధీనం చేసుకున్న అధికారులు

ఏడాదిగా వృథాగా ఉంచిన వైనం

ఇప్పుడు పనికొస్తాయో.. లేదో?



ధర్మవరం, మే 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో వలంటీర్లకు ఇచ్చిన సెల్‌ఫోన్లు పని చేస్తాయా? ఎన్నికల ముందు స్వాధీనం చేసుకున్న వాటిని భద్రంగానే ఉంచారా? ప్రస్తుతం వాడకానికి పనికొస్తాయా? కోట్లు ఖర్చు చేసి కొనుగోలు చేసిన వాటిని ఏడాది కాలంగా వృథాగా ఎందుకు ఉంచారన్న ప్రశ్నలు వేధిస్తున్నాయి. గతంలో వైసీపీ హయాంలో వేల రూపాయల విలువైన ఆండ్రాయిడ్ ఫోన్‌ను కొనుగోలుచేసి వలంటీర్లకు అందజేశారు. వీటి ద్వారా క్షేత్రస్థాయిలో పథకాలకు అర్హులు, అనర్హుల డేటాను సేకరించారు. వివిధ రకాల సర్వేలు చేయించారు. రేషన్ పంపిణీ మొదలుకొని ధాన్యం సేకరణ, ఇతర సబ్సిడీలు, డీబీటీ పథకాలను వీటి ద్వారానే అందజేశారు. లబ్ధిదారులకు ఏ పథకం అమలు చేయాలన్నా ఈ ఫోన్‌ల ద్వారానే జరిగేది. 50 కుటుంబాల సమాచారం ఈ ఒక్క ఫోన్‌లోనే నిక్షిప్తమై ఉండేది. జిల్లాలో 8వేల మంది వలంటీర్లు పని చేశారు. గతంలో వీరందరికి ఫోన్‌లు పంపిణీ చేశారు. అయితే గత ఎన్నికల సమయంలో వలంటీర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలోని వలంటీర్ల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఆయా మండల ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచారు. మున్సిపాలిటీల్లో అయితే కొన్నింటిని కలెక్టరేట్‌కు పంపగా మిగిలిన వాటిని ఆయా వార్డు సచివాలయాల్లోనే భద్రపరిచినట్లు సమాచారం. ఇవి ఇప్పుడు పని చేస్తాయో లేదో తెలియని పరిస్థితి.

జీపు, బైక్ ఢీ.. ఇద్దరి మృతి



అర్జున్, పునిత్ (ఫైల్)

చింతామణి, మే 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరు రోడ్డులోని నాయింద్రహళ్ళి గేట్ వద్ద గురువారం రాత్రి జీపు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. మృతులను కైవార హోబళి తళగవార గ్రామానికి చెందిన అర్జున్ (30), పునిత్ (20)గా గుర్తించారు. చింతామణి పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్‌లో కూలి పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా బెంగళూరు నుంచి ఎదురుగా వచ్చిన జీప్ ఢీ కొనడంతో బుల్లెట్‌బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడి తలకు తీవ్రగాయాలు కావడంతో దుర్మరణం చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే జీప్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదం జరిగిన అరగంట గడిచినా అంబులెన్స్, పోలీసులుగానీ చేరుకోకపోవడంతో స్థానికులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో రెండుగంటలకుపైగా ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. చివరకు సమాచారం అందుకున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్పందించడంతో అంబులెన్స్ ద్వారా మృతదేహాలను చింతామణి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రెండు వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదస్థలం నుంచి రెండు వాహనాలను క్రేన్‌సాయంతో తొలగించాక ట్రాఫిక్‌కు వీలు కల్పించారు. చింతామణి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రూ.4.17 లక్షల విలువైన నగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న పోలీసులు

బంగారుపేట, మే 2(ఆంధ్రజ్యోతి): బంగారుపేటలో చోరీలకు సంబంధించి ఒక మహిళను అరెస్టు చేసి రూ.4.17 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. బంగారుపేట నివాసి రుక్కమ్మ పట్టుబడిన నిందితురాలు. ఆమెనుంచి 43 గ్రాముల బంగారం, 1 కేజీ 454 గ్రాముల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. డూప్లికేట్ తాళాలతో ఇళ్ల చోరీలకు పాల్పడేదన్నారు. ఇటీవల లక్ష్మీదేవమ్మ అనే మహిళ పుట్టింటికి వెళ్లి మూడు రోజుల తర్వాత వచ్చింది. చోరీ విషయం వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మూడు రోజుల్లోనే చోరీ కేసును ఛేదించామని సీఐ దయానంద్, ఎస్సై ప్రకాశ్‌నరసింగ్ తెలిపారు. ఎస్పీ కాంతరాజు, డీఎస్పీ పాండురంగల మార్గదర్శకంలో కార్యాచరణ నిర్వహించినట్టు తెలిపారు.

ఆర్కిడ్స్‌లో వందశాతం ఉత్తీర్ణత

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): ఆర్కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐసీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధ్యమైనట్టు సహకారనగర్ శాఖ ప్రిన్సిపాల్ నాన్సి సైంతిక తెలిపారు. సాయిశృతి 97.6శాతం, మైథిలి 96.60శాతం ఫలితాలు సాధించారని, యలహంక శాఖలో ప్రతిష్ఠ బాలియాసింగ్ 96.80శాతం, సాయిమనోజవం 95.20 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రకటించారు. ప్రణాళిక ప్రకారం అకడమిక్ జరిపినట్టు అకడమిక్ వైస్‌ప్రెసిడెంట్ అజిత్‌సింగ్ తెలిపారు.

నేషనల్ విద్యార్థికి రెండో ర్యాంకు

బెంగళూరు, మే 2(ఆంధ్రజ్యోతి): బసవనగుడి నేషనల్ హైస్కూల్ విద్యార్థి ప్రణవి ఎన్ రాజ్‌కి రాష్ట్రస్థాయిలో రెండోర్యాంకు దక్కింది. ఈ మేరకు పాఠశాలలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ హెచ్ఎన్ సుబ్రమణ్య, గౌరవ కార్యదర్శి వెంకటశివారెడ్డి తదితరులు సత్కరించారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధ్యమైనట్టు ప్రకటించారు.

పదిలో రాణించిన మ్యాక్స్‌ముల్లర్ విద్యార్థులు



అధిక మార్కులు సాధించిన విద్యార్థులు

బెంగళూరు, మే 2 (ఆంధ్ర జ్యోతి): పదో తరగతి ఫలితాల్లో మహాలక్ష్మి పురం మ్యాక్స్ ముల్లర్ పాఠశాల విద్యార్థులు రాణించారు. 97శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రిన్సిపాల్ హరి తెలిపారు. 90శాతం మార్కులతో 15మంది, 85శాతం కంటే పైగా 9మంది, ఫస్ట్‌క్లాస్‌లో 27మంది, సెకండ్‌క్లాస్‌లో 36 మంది ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. గీతారోహిణి 99.04 శాతం, బిందు అన్ను 98.08 శాతం, ప్రకృతి జె నిసర్గ 97.92 శాతంతో ఉత్తమ మార్కులు సాధించారు.

బాలికల వికాసంపై అవగాహన

తనకల్లు, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి, టీ.స దుం గ్రామాల్లో కిషోర్ బాలికలకు వేసవి శిక్షణలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 సంవత్సరాల నుంచి 18 వయసున్న బాలికలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కిషోర్ వికాసానికే ఈ వేసవి శిక్షణ ఇస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళ పోలీసులు ఫాతిమా, రిహానా, రమాదేవి, కోటపల్లి, మల్లిపల్లి, టీ.సదుం పంచాయతీల అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

● బత్తలపల్లి: మండలంలోని సంజీవపురంలో కిషోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు సీడీపీఓ సరస్వతి శుక్రవారం ప్రారంభించారు. జూన్ 10 వరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇందులో బాలికలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమములో సూపర్‌వైజర్ దేవమణి పాల్గొన్నారు.

● కదిరిఅర్బన్: మండలంలోని కాళసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు సూపర్‌వైజర్ నిహారిక తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎం, బాలికలు, ఆయాలు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.25	1,578.03
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	368	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	327	120
నీటి నిల్వ (టీఎంసీలు)	6.85	3.58

హిందువులపై దాడులను అరికట్టాలి



నిరసన తెలుపుతున్న హిందుజాగరణ వేదిక

బళ్లారి సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో హిందువులపై ఉగ్రదాడులను నిరసిస్తూ శుక్రవారం హిందూ జారగరణ వేదిక జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టింది. శుక్రవారం నగరంలోని నారాయణరావు పార్కు నుంచి హిందూ జాగరణ వేదిక ర్యాలీ చేపట్టారు. గడిగిచెన్నప్ప సర్కిల్ మీదుగా ర్యాలీ కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. విశ్వహిందూ పరిషత్ రాలీకి మద్దతునిచ్చింది. పాకిస్థాన్‌పై యుద్ధం చేసి తగిన బుద్ధి చెప్పాలన్నారు. హిందూ జాగరణ వేదిక, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్వాసన భరించలేకున్నాం..!



రాజుకాలువ సమీపంలో తొలగించని చెత్త

బళ్లారిరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని 1వ వార్డు సమీపంలో పార్వతి నగర్, కేపీహెచ్‌బీ కాలనీ రాజుకాలువ సమీపంలో ఉన్న చెత్తాచెదారంతో దుర్వాసన భరించలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత మహానగర పాలికె అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వార్డు ప్రముఖులు, ప్రజలు కోరుతున్నారు. వెంటనే చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు.

బోను ఏర్పాటు



కోతులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన బోను

కంప్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): సండూరు తాలుకా జోగ గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన తిప్పే రుద్రేష్‌పై కోతి దాడి చేసి గాయపరిచింది. ఐదు, ఆరు నెలలుగా గ్రామంలో కోతుల బెడద ఎక్కువై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు రోడ్లపై నడుచుకుంటూ వెళ్లేందుకు భయపడుతున్నారు. ఏదైనా పనులపై బయటకు వచ్చినవారిపై కోతులు దాడి చేసి గాయపరుస్తున్నారు. విషయం అటవీశాఖ అధికారులకు తెలపడంతో వారు గ్రామంలో బోనును ఏర్పాటు చేశారు.

కొండపై చిరుత సంచారం



కాసనకండి అడవుల్లో కనిపించిన చిరుత

కంప్లి, మే 2(ఆంధ్రజ్యోతి): కొప్పల్ తాలుకాలోని కసనకండి గ్రామ అడవుల్లో గురువారం సాయంత్రం చిరుత ప్రత్యక్షమైంది. కొండ పక్కన పొలాల్లో పనులు చేస్తున్న రైతులు చిరుతను చూసి కేకలు వేయడంతో చిరుత కొండల్లోకి పరుగులు తీసింది. కొన్ని రోజులుగా కసనకండి గ్రామంతో పాటు చిక్కబగనాళ్, కర్కిహళ్లి గ్రామాల్లో చిరుతలతో పాటు ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు, రైతులు తెలిపారు. పొలాల్లో పనులకు వెళ్లేందుకు రైతన్నలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ అధికారులు స్పందించి వెంటనే బోను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా శంకరాచార్య జయంతి



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ ముల్లంగి నందీశ్, వేదబ్రహ్మ శ్రీరామ సుబ్రహ్మణ్య శర్మ

బళ్లారి సిటీ,ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): హిందూ సంస్కృతి పునరుజ్జీవనానికి ప్రాచీన భారతీయ ఉపనిషత్తుల సూత్రాలను ఆది శంకరాచార్యుల సహకారం అపారమని మహానగర పాలక సంస్థ మేయర్ ముల్లంగి నందీశ్ అన్నారు. జిల్లాయంత్రాంగం, జిల్లాపంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సంగనకల్లు రోడ్డులోని భారతీతీర్థ సభా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన శంకరాచార్య జయంతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయన అద్వైత వేదాంత తత్వాన్ని స్థాపించారన్నారు. మతం పేరుతో వ్యాప్తిచెందిన వివిధ అపోహలను తొలగించేందుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. ఈరోజు శంకరాచార్యను పూజిస్తూ స్మరిస్తున్నామని అన్నారు. ప్రత్యేక ఉపన్యాసంలో వేదబ్రహ్మ శ్రీరామ సుబ్రహ్మణ్యశర్మ మాట్లాడుతూ ఆది శంకరాచార్యులు భారతదేశపు గొప్ప అధ్యాత్మిక తత్వవేత్తలలో ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో బళ్లారికి చెందిన రాజేశ్వరీ బృందం భక్తి సంగీత ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజు, శృంగేరి శంకర మఠం మేనేజర్ బి.ఎస్.మూర్తి, బ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాశ్‌రావు, అఖిల కర్ణాటక బ్రాహ్మణ సంఘం మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్, నేత్రవైద్యుడు డాక్టర్ సుధాకర్, ఆడిటర్ డాక్టర్ శ్రీధర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సిరుగుప్ప: పట్టణంలో శంకరాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నరసప్ప ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఆయన భావచిత్రపటానికి పూజలు చేసి నివాళి అర్పించారు. శంకరాచార్యుల చరిత్ర ఎంతో వుందని ఆయన తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర, సిద్దార్థ, రెవెన్యూ అధికారులు మహంతేష్, మంజునాథ, సిబ్బంది పాల్గొన్నారు.



శంకరాచార్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

పేదరికంలో విరిసిన విద్యాకుసుమం..!

● పదిలో 599 మార్కులు సాధించిన అంజలి



బళ్లారి, మే 2(ఆంధ్రజ్యోతి): వారిది ఓ మధ్యతరగతి కుటుంబం. పిల్లల చదువుకోసం అని అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం తీటకల్లు గ్రామం నుంచి తల్లిదండ్రులు, బి.వెంకటేశులు సుధా కర్ణాటకలోని బళ్లారికి వలస వచ్చారు. బళ్లారి-బొమ్మనహాళ్ బైపాస్ రోడ్డు పక్కన హోటల్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. కూతురు బి.అంజలిని బళ్లారి ప్రాంతంలోని ఆంధ్రాళలో ఉన్న మోడల్ స్కూలో చదివించారు. తల్లిదండ్రులు మా చదువు కోసం ఊరుగాని ఊరుకొచ్చి పడుతున్న కష్టం కళ్లారా చూసిన అంజలి తను ఎలాగైనా బాగా చదువుకుని మంచి ఉద్యోగం సంపాదించి అమ్మానాన్నల కష్టాలు తీర్చాలనుకుంది. ఉదయం బడికి వెళ్లి అనంతరం అమ్మానాన్నలకు హోటల్‌లో చేదోడుగాదోడుగా ఉండేది. పేదరికం కావడంతో పదోతరగతిలో మంచి మార్కులు వస్తే ఇంటర్‌లో ఏ కలేజీలోనైనా ఫ్రీ సీట్ వస్తుందనే ఆశతో ఆమె మరింత కష్టపడి చదివి పదోతరగతిలో 625 మర్కులకు గాను 599 మార్కులు సాధించింది. కన్నడలో 96, ఇంగ్లీష్‌లో 111, హిందీలో 99, లెక్కల్లో 96, సైన్స్‌లో 97, సోషియల్‌లో 100 మార్కులు సాంధించింది. తల్లిదండ్రులతో పాటు ఆ కాలనీవాసులు కేస్ కట్ చేసి అంజలికి శుభాకాంక్షలు తెలిపారు. అంజలి మాట్లాడుతూ నాకు ఇంకా 10 మార్కులు రావాల్సిందని, కన్నడ, ఇంగ్లీష్, మ్యాథ్స్‌లో కొన్ని మార్కులు తగ్గాయని తెలిపింది. రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేస్తానన్నారు. ఇంటర్ చదువుకునేందుకు నాకు ఆర్థిక స్తోమత లేదని, మంచి కాలేజీలో సీట్ వస్తే మంచి మార్కులు సాధించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించి అమ్మానాన్నలను కష్టాల నుంచి రక్షించుకుంటానని అంజలి తన మనసులోని మాటను వ్యక్తం చేసింది.

కార్మికుల కోడ్ నిలిపివేయాలని 20న సమ్మె



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి

బళ్లారి సిటీ, మే 2(ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికుల కోడ్‌ను అమలు చేయబోతున్న కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 20వ తేదీన సార్వత్రిక సమ్మె చేపట్టాలని నిర్ణయించినట్లు సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి తెలిపారు. శుక్రవారం హొసపేట పత్రికాభవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్లమెంట్‌లో ఇప్పటికే ఆమోదించిన కార్మిక నియమావళిని కేంద్ర ప్రభుత్వం ఏ క్షణంలోనైనా అమలు చేసే అవకాశం ఉందని అన్నారు. ఇది కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేస్తుందన్నారు. ఈ విధానం బడా కంపెనీలను కాపాడటం కోసమే అన్నారు. దేశంలోని కార్మికులందరూ మేల్కొని పోరాడాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా దేశంలోని 70శాతం మంది కార్మికులకు కార్మిక చట్టాలు వర్తించవన్నారు. కనీస దినసరి వేతనం రూ.187 నిర్ణయించే ప్రమాదం ఉందన్నారు. ఫ్యాక్టరీలు అకస్మాత్తుగా మూతపడే ప్రమాదం ఉందన్నారు. సమ్మెచేసే హక్కును తీసేసే వీలుందన్నారు. ఓవర్ టైం(ఓటీ)ని 3 నెలలకు 50గంటలకు బదులుగా 125 గంటలకు పెంచాలని కేంద్రం భావిస్తోందన్నారు. ఇది ఉద్యోగుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. వీటన్నింటినీ కార్మికులతో ఒప్పించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిపారు. సార్వత్రికసమ్మె ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షులు ఆర్.బసవరాజ్, కార్యదర్శి మంజునాథ్, జిల్లాకోఆర్డినేటర్ నాగరత్న పాల్గొన్నారు.

శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి

● హోంమంత్రి రాజీనామా చేయాలి: శ్రీరాములు



మాట్లాడుతున్న శ్రీరాములు

బళ్లారి ,మే 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నామని మాజీ మంత్రి బి.శ్రీరాములు అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళూరు సుహాస్ శెట్టి హత్య కేసును దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశాడు. హిందూ కార్మికుడి పరిస్థితి ఇది అయితే ప్రజానీకం పరిస్థితి ఏంటీ అని ఆయన ప్రశ్నించారు. హోంశాఖ మంత్రి పాలనలో విఫలమయ్యారని తక్షణం రాజీనామా చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పదుల సంఖ్యలో హిందూ కార్యకర్తలు హత్యకు గురయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీఎఫ్ఐ, ఎస్డీపీఐ కేస్ మూసివేశారన్నారు. సుహాస్ శెట్టి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గోవిందరాజులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిపై ముమ్మర దర్యాప్తు

రాయచూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద నగరానికి చెందిన యువకుడి అనుమానాస్పద మృతిపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు. గురువారం రాత్రి నగరంలోని ఇందిరా నగర్‌కు చెందిన వీరేశ్(35) హత్యకు గురైనట్లు పోలీసులు భావిస్తున్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో వీరేశ్ రైల్వే స్టేషన్ వద్ద పడిపోయాడు. తాగిన మత్తులో ఎవ్వరో గుర్తు తెలియని వ్యక్తి నిద్రిస్తున్నాడనుకుని భావించిన ప్రజలు ఎవరూ అతన వద్దకు వెళ్లలేదు. మరుసటి రోజు అనుమానం వచ్చిన వారు ఆయనను నిద్రలేపే ప్రయత్నం చేయగా చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని పోలీసులకు చేరవేయగా అక్కడికి చేరుకున్న వెస్ట్ పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోసం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ మృతికి సంబంధించిన కారణాల కోసం పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామశివారులో గల రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన రత్నమ్మ, శశికళ, ఇందుశ్రీ కలిసి కారులో పత్తికొండకు వెళుతున్నారు. బసినేపల్లి గ్రామ శివారులోకి రాగానే ప్రమాదవశాత్తూ కారు బోల్తా పడింది. దీంతో అందులోని ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి వెంటనే వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అధికారులకు కచ్చితమైన సమాచారం ఇవ్వండి

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల అధికారులకు ఖచ్చితమైన సమాచారం అందించాలని ప్రజలకు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సూచించారు. జస్టీస్ నాగమోహన్ దాస్ ఏకసభ్య విచారణ కమిషన్ ఆదేశాల మేరకు 5 నుంచి 23వ తేదీ వరకు జిల్లాలో 3దశల్లో షెడ్యూల్డ్ కులాల అంతర్గత రిజర్వేషన్ వర్గీకరణ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రజలు తమ కులం, ఉపకులం, ఇతర సమాచారం గురించి ఖచ్చితమైన ఇవ్వాలన్నారు. రాష్ట్ర జిల్లా, తాలూకా స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామని, రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన 3 జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా 50మంది తాలూకా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, 125మంది సూపర్‌వైజర్లు, 2,674 మంది ఎన్యూమరేటర్లు, 200మంది అదనపు ఎన్యూమరేటర్లను సర్వే పనుల కోసం నియమించామని ఆయన తెలిపారు. జిల్లాయంత్రాంగం ఇప్పటికే తాలూకాస్థాయి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చిందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో షెడ్యూల్డ్ కులాల అంతర్గత రిజరేషన్ సర్వే కోసం హెల్ప్‌లైన్ కేంద్రం ప్రారంభించామని, 8277888866, 08392277100 నంబర్లకు ప్రజలు సంప్రదించవచ్చన్నారు. సర్వే పనిని విజయవంతంగా పూర్తి చేసేందుకు అవసరమైన సహకారాన్ని అందించాలని ప్రజలను కలెక్టర్ కోరారు.

పది ఫలితాల్లో బళ్లారికి 29వ స్థానం



బళ్లారి సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా గత ఏడాది పది ఫలితాల్లో 28వ స్థానంలో నిలవగా, ఈసారి ఒక స్థానం దిగజారింది. మొత్తం 20,126 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 12,128మంది ఉత్తీర్ణులయ్యారు. అంటే 60.26శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను మెరుగుపరిచేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లా పంచాయతీ అనేక కార్యక్రమాలను నిర్వహించాయి. కాళికా అసారే, ప్రతిబింబ అనే వ్యాయామ పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. యూనిట్, ప్రిపరేటరీ పరీక్షల్లో తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలలను గుర్తించి వాటిపై ఎక్కువ శ్రద్ధపెట్టారు. పాఠశాలలకు నోడల్ అధికారులను నియమించారు. ఈ చర్యలన్నీ చేపట్టినా 29వ స్థానానికి పడిపోయింది. జిల్లాస్థాయిలో ఉన్నత పాఠశాలలకు మంజూరు చేసిన ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య 1,198 అయితే, విధులు నిర్వహిస్తున్న వారి సంఖ్య 711 మాత్రమే. మగిలిన 487 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీని ప్రభావం ఫలితాలపై పడిందని అధికారులు చెబుతున్నారు.

మొరార్జీ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



కల్పన (616)



చాగలింగ (613)



భూమిక (601)

బళ్లారి రూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి రూరల్ భైరదేవనహళ్లి వద్ద నున్న మొరార్జీ పాఠశాల విద్యార్థులు పది పరీక్షల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ అనసూయ తెలిపారు. విద్యార్థిని కల్పన 616 మార్కులు, హెచ్ చాగలింగ 613, భూమిక 601 మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాణించిన విద్యాసాగర్ పాఠశాల






అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

కంప్లి, మే 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యాసాగర్ పాఠశాల పది ఫలితాల్లో విద్యార్థులు రాణించారు. 18 సార్లు వందశాతం ఫలితాలు పాఠశాల దక్కించుకుంది. ఈ ఏడాది ఫలితాల్లో 97.38 శాతం నమోదైంది. 71 మంది విద్యార్థులకు గాను 69 ఉత్తీర్ణులయ్యారు. అందులో నందిత, మహమ్మద్ హుస్సేన్ ఖాన్, చైతన్య, వర్ష 600కు పైగా మార్కులు సాధించారు. ఏ ప్లస్ 29, ఏ 15, బి ప్లస్ 13, బి తొమ్మిది, సీ ప్లస్ 3, డిస్టిక్షన్‌లో 37 మంది పాసైనట్లు పాఠశాల వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు తెలిపారు. పాసైన విద్యార్థులకు ప్రిన్సిపాల్ కిషోర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మొదటి స్థానం కంప్లికే..: జిల్లాలో పది ఫలితాల్లో ప్రథమ స్థానం కంప్లికే దక్కింది. ఈ ఏడాది పది ఫలితాల్లో పట్టణమే మొదటిస్థానంలో నిలిచింది. ప్రథమ సాథనం విద్యాసాగర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలకు చెందిన హెచ్ నందిత అను విద్యార్థిని 625 మార్కులకుగాను 622 మార్కులు సంపాదించుకుని జిల్లాలో మొదటి స్థానం దక్కించుకుంది.



నందిత (622)

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



వ్యవసాయ పంపుసెట్ మోటార్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు సూచించారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణ హైస్కూలు మైదానంలో వాల్మీకి అభివృద్ధి పథకం కింద రైతులకు పంపుసెట్ మోటార్లు, పరికరాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను పొంది అభివృద్ధి బాటలో పయనించాలన్నారు. కార్యక్రమంలో నగరసభ అధ్యక్షురాలు రేణుకమ్మ, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, పాటిల్, కౌన్సిలర్లు గణేష్, నజీర్, కాంగ్రెస్ పార్టీ తాలుకా అధ్యక్షులు కరిబసప్ప, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

కుందుర్పి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయదార్లపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మిద్దె కూలింది. అయితే అదృష్టవశాత్తూ అందులోని వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. గ్రామానికి చెందిన మర్రిస్వామి రోజూమాదిరిగానే భార్యాపిల్లలతో ఇంటిలోని వరండాలో పడుకున్నారు. రాత్రి వడగండ్ల వర్షం కురవడంతో ఇంట్లోని లోపల గది ఒక్కసారిగా కూలి పెద్ద శబ్దం వచ్చింది. దీంతో వారు ఉలిక్కిపడి నిద్రలేచి బయటకు పరుగులు తీశారు. ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లోని వంటసామగ్రి ధ్వంసమయ్యాయి. బియ్యం నేలపాలయ్యాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

హోసూరు జోన్

200పైగా నియోజకవర్గాల్లో విజయం సాధించాలి: మంత్రి చక్రపాణి



మాట్లాడుతున్న మంత్రి చక్రపాణి

హోసూరు, మే 2(ఆంధ్రజ్యోతి): 2026 శాసనసభ ఎన్నికల్లో 200కుపైగా నియోజకవర్గాల్లో డీఎంకే కూటమి విజయం సాధించాలని పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. కృష్ణగిరి పశ్చిమజిల్లా డీఎంకే కార్యవర్గ సమావేశంలో జిల్లా యువనాయకుడు యువరాజ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్, హోసూరు కార్పొరేషన్ మేయర్ సత్యతోపాటు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి చక్రపాణి మాట్లాడుతూ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు పార్టీ చీఫ్, సీఎం ఎంకే స్టాలిన్ చొరవ తీసుకున్నారన్నారు. రూ.100కోట్లతో జిల్లా ప్రధాన ఆసుపత్రి, కొత్త బస్టాండ్ పనులు జరుగుతున్నాయి. ఇంకా రూ.300 కోట్లతో హోసూరులో పెద్దస్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో డిప్యూటి మేయర్ ఆనందయ్య, ప్రధాన కార్యవర్గ సభ్యుడు ఇల్లామణి, ఆరోగ్యస్థాయి సమితి అధ్యక్షుడు మాదేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు వేగవంతం చేయాలి

హోసూరు, మే 2(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో రూ.582.54 కోట్లతో చేపట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులు వేగిరం చేయాలని మంత్రి చక్రపాణి పేర్కొన్నారు. హోసూరు కార్పొరేషన్ పరిధిలోని శాంతపురం, రామనాయకన్ ఏరియాలో రెండు విభాగాలుగా పనులు కొనసాగుతున్నాయి. వీటిని మంత్రి పరిశీలించారు. అంతకుముందు కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌తో సమావేశమయ్యారు. సమావేశంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్, కార్పొరేషన్ కమిషనర్ మారిచెల్లి, సబ్‌కలెక్టర్ ప్రియాంక, డిప్యూటి మేయర్ ఆనందయ్య, తదితరులు పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న పనులపై అధికారులనుంచి మంత్రి అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో మంత్రి చక్రపాణి తదితరులు

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

హోసూరు, మే 2(ఆంధ్రజ్యోతి): హోసూరు ఇండస్ట్రీస్ అసోసియేషన్, కావేరి హాస్పిటల్ సంయుక్తంగా హోసూరు క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహించగా ఉత్సాహంగా సాగాయి. ఆదియమాన్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడామైదనంలో క్రికెట్ పోటీలు జరిగాయి. మొదటి బహుమతిగా లక్షల రూపాయలు, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేలుగా ప్రకటించారు. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు బెస్ట్ ప్లేయర్, తదితర అవార్డులు అందచేశారు. కావేరి ఆసుపత్రి డైరెక్టర్ అరవిందన్ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీతో విజేతజట్టు